నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 25 డిసెంబర్ 2023 | NALGONDA



యాదగిరిగుట్ట మాఢ వీధుల్లో గోవర్ధనగిరిగా స్వామివారి ఊరేగింపు

## వేణుగోపాలుడిగా.. గోవర్ధనగిరిధారిగా..

**యాదగిరి గుట్టలో వైభవంగా అధ్యయనోత్సవాలు**

**పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు**

యాదగిరిగుట్ట, డిసెంబర్24 : యాదగిరి గుట్ట ప్రధానాలయంలో ఆళ్వార్ దివ్య ప్రబంధ అధ్యయనోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండోరోజు ఉదయం లక్ష్మీనరసింహ స్వామి వేణుగోపాల స్వామిగా, సాయంత్రం గోవర్ధనగిరి ధారి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల కిటకిటలాడాయి.

## సీఎం మీటింగ్‌లో మన అధికారులు







రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఆదివారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నల్లగొండ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ అపూర్వరావు, సూర్యాపేట నుంచి వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రాహుల్ హెగ్డే హాజరై వివరాలను వెల్లడించారు.

# స్వేద పత్రంలో మన జిల్లా

**తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో గణనీయ అభివృద్ధి**



- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లె నుంచి పట్టణం వరకు మారిన రూపురేఖలు
- మిషన్ భగీరథతో దశాబ్దాల ఫ్లోరైడ్ భూతం మాయం
- కాళేశ్వరం జలాలతో బీడు భూములు సస్యశ్యామలం
- 13 లక్షల ఎకరాల నుంచి 26 లక్షలకు పెరిగిన సాగు విస్తీర్ణం
- ధాన్యం ఉత్పత్తిలో ఉమ్మడి జిల్లా అగ్రస్థానం
- ఇల వైకుంఠంగా యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం
- జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు
- దామరచర్లలో 4వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం
- అంతటా పెరిగిన సంపద.. మెరుగుపడిన ఉపాధి అవకాశాలు
- స్వేద పత్రం విడుదల సందర్భంగా జిల్లా ప్రగతిని వివరించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తప్పుడు లెక్కలతో అప్పులు చెప్పిన కాంగ్రెస్.. ఆస్తులు చెప్పలేదని ప్రస్తావన

సూర్యాపేట, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు ప్రజలకు అన్నీ సమస్యలుగానే ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఎంతో మారింది. వేల కోట్ల రూపాయల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పల్లెలు, పట్టణాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. ఉపాధి అవకాశాలు మెరుగుపడి, సంపద గణనీయంగా పెరిగింది. దశాబ్దాల తరబడి నల్లగొండను పట్టి పీడించిన ఫ్లోరైడ్ రక్కసి మిషన్ భగీరథ పథకంతో పూర్తిగా కనుమరుగైంది. కాళేశ్వరం జలాలతో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయి. నాగార్జున సాగర్, మూసీ ప్రాజెక్టుల ఆధునీకరణతో ప్రతియేటా రెండు పంటలకు నీటి విడుదల జరిగింది. ఉమ్మడి జిల్లాలో 2014కు ముందు 13 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా ఈ ఏడాది వరకు 26 లక్షల ఎకరాలకు చేరుకుంది. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు, 24 గంటల విద్యుత్‌తో నాటి నిరసనలు, ధర్నాలు అసలే లేవు. రూ.1200 కోట్లతో యాదగిరి గుట్ట ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించారు. ఇల వైకుంఠంగా ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నది. రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు అందించేందుకు దామరచర్లలో 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వ దవాఖానలు కార్పొరేట్‌కు దీటుగా మారాయి. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలు అందుబాటులోకి రాగా యాదాద్రిలో నిర్మాణం కానున్నది. హరితహారం, పల్లె ప్రకృతి వనంతో పచ్చదనం సంతరించుకోగా.. ప్రతి ఊరికి రోడ్డు, సీసీ రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం వంటి ఎన్నో పనులు జరిగాయి. కులవృత్తులు మెరుగుపడ్డాయి. చేతినిండా పనులు దొరుకుతుండడంతో వలస జీవులు సొంతూళ్లకు వచ్చి సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. ఇవన్నీ అభివృద్ధి, సంక్షేమంలో జరిగిన మార్పులు. ప్రత్యక్షంగా, పరోక్షంగా మరెంతో మందికి లబ్ధి చేకూరుతున్నది. కానీ ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో శ్వేత పత్రాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పింది. కానీ ఆస్తులు, సంపద ఏమేర పెరిగాయో చెప్పలేదు. ఈ విషయాలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం స్వేద పత్రం విడుదల చేశారు. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రంతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన ప్రగతిని, మార్పును స్పష్టంగా వివరించారు.

### ఫ్లోరిన్ రక్కసికి విరుగుడు

ఉమ్మడి పాలనలో నల్లగొండ జిల్లా పేరు ప్రపంచంలోనే రికార్డుల్లోకి ఎక్కింది. అదేదో గొప్ప పని చేసినందుకు కాదు తాగు నీటిలో ఫ్లోరిన్ కారణంగా కాళ్లు, చేతులు, నడుము వంకర్లు తిరిగి నల్లగొండ జిల్లాలో రెండు లక్షలకు పైగా ప్రజలు జీవచ్ఛవాలుగా బతికే పరిస్థితి ఉన్నందుకు. జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ ఫ్లోరోసిస్ బాధితులతో ఆనాటి ప్రధాని వాజ్‌పేయి వద్దకు వెళ్లి ఫ్లోరైడ్ బాధితుడు అంశుల స్వామిని ఏకంగా ప్రధాని ఎదుట టేబుల్‌పై పడుకోబెట్టి ఈ ప్రాంత దీనస్థితిని వివరించారు. 2014కు ముందు జిల్లాలో 967 ఫ్లోరైడ్ ఆవాస ప్రాంతాలు ఉండేవి. తెలంగాణ ఏర్పాటైన అనంతరం కేసీఆర్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందించి ఫ్లోరైడ్ బాధను తీర్చింది. తొమ్మిదిన్నరేండ్ల కృషి అనంతరం నేడు రాష్ట్రంలో ఫ్లోరైడ్ పీడిత ప్రాంతం ఒక్కటి కూడా లేదని ఏకంగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకటించింది.



నల్లగొండలో స్వేద పత్రంపై కేటీఆర్ ప్రజెంటేషన్‌ను టీవీల్లో వీక్షిస్తున్న ప్రజలు

### కాళేశ్వరం జలాలు 405 కిలో మీటర్లు పారుదల

మేడిగడ్డ వద్ద కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి 405.45 కిలోమీటర్ల దూరంలో చివరి ఆయకట్టుగా ఉన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు పుష్కలంగా సాగునీరు అందడంతో నేడు ఆ ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యాయి. దాంతో పాటు సూర్యాపేట జిల్లాలోని చిట్టచివరి ప్రాంతమైన పెన్‌పహాడ్ మండలం మాచారం రావి చెరువుకు కూడా కాళేశ్వర జలాలు చేరుతున్నాయి. దాంతోపాటు నాగార్జునసాగర్ నుంచి మనకు రావాల్సిన వాటా నీటిని పక్కాగా వినియోగించుకోవడం ద్వారా ఎడమకాల్వ ఆయకట్టుకు పక్కాగా సాగునీరు అందింది. దానికి తోడు మూసీ ప్రాజెక్టు ఆధునీకరణ, నదులు, వాగుల నీరు వృథాగా పోకుండా కోట్ల రూపాయలతో వాటిపై చెక్‌డ్యాంలు సైతం నిర్మించింది. దీనికి తోడు మిషన్ కాకతీయ ద్వారా చెరువులను ఆధునీకరించడంతో అవి ప్రస్తుతం నీటితో కళకళ లాడుతున్నాయి. దాంతో 2014కు ముందు జిల్లాలో 13 లక్షల ఎకరాలుగా ఉన్న ఆయకట్టు నేడు 26 లక్షల ఎకరాలకు చేరింది. గతంలో అన్ని రంగాల్లో వెనుకబడిన ఉమ్మడి నల్లగొండ జిల్లా నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. ఇక 24 గంటల విద్యుత్‌తో జిల్లా వెలుగులు నిండింది. దామరచర్ల వద్ద నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల పవర్‌ప్లాంట్ 90 శాతం పూర్తయింది. ఇది పూర్తయితే మన రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రంగా అవతరించనుంది. దేశంలోనే ఇప్పటి వరకు ఎక్కడా, ఎవ్వరూ పునర్నిర్మాణం చేయనట్లుగా యాదాద్రి ఆలయ నిర్మాణాన్ని కేసీఆర్ ప్రభుత్వం వేల కోట్లతో నిర్మించింది. దాంతో ఆలయానికి ప్రస్తుతం భక్తులు వేల సంఖ్యలో తరలివస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. ప్రతి జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు ద్వారా ప్రస్తుతం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మెడికల్ కళాశాలలు రావడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన పేద విద్యార్థులకు సైతం వైద్యవిద్య చేరువైంది. జిల్లా కేంద్రాల్లోని వైద్య శాలలను బోధనాస్పత్రులుగా మార్చి ఆధునిక పరికరాలు, భవనాలు సమకూర్చడంతో ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యం మన వద్ద అందుతున్నది.

### ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్



తెలంగాణ ప్రజలు 60 ఏండ్లు పడ్డ గోసను 10 ఏండ్ల కాలంలో తీర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదే. దానిని వదిలేసి కేవలం అప్పులను మాత్రమే చూపుతూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నది. విద్యుత్ కొరతను అధిగమించి వెలుగు జిలుగుల రాష్ట్రంగా తెలంగాణ మారింది. వ్యవసాయాన్ని పండుగ చేసి రైతును రాజుగా చేసింది గత ప్రభుత్వమే. అది వారికి కనిపించలేదా..? కాళేశ్వరంలో అవినీతి జరిగితే ఆ ప్రాజెక్టు నాలుగున్నరేండ్లలో ఏలా పూర్తవుతుంది. పట్టణ, పల్లె ప్రగతి ద్వారా ప్రతి ఊరిలో వసతులు కల్పించడంతో పాటు పార్కులు, వైకుంఠధామాలు, సీసీ రోడ్ల నిర్మాణం, రైతువేదికలు నిర్మించింది వాస్తవం కాదా. తెలంగాణలో తలసరి ఆదాయాన్ని పెంచి, విభజన సమయంలో 21 శాతంగా ఉన్న పేదరికాన్ని పదేండ్ల కాలంలో 5 శాతానికి తగ్గించింది. గురుకులాలు ఏర్పాటుచేసి లక్షల మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత కేసీఆర్‌దే. సంక్షేమం కోసం అప్పులు అయినా భవిష్యత్‌లో వీటివల్ల సంపదను పెంచుకో గలుతుతాం.

– పాదూరి సంజీవరెడ్డి, మిర్యాలగూడటౌన్

### అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దే



రాష్ట్ర ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత గత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే. మాడ్గులపల్లి కొత్త మండలంగా ఏర్పాటు కాకముందు మేము ఏ పనికైనా 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త మండలంగా ఏర్పాటు చేయడంతో మాకు ఆ బాధలు తొలగాయి. కేసీఆర్ వచ్చిన తరువాతే 24గంటల కరెంట్ ఇచ్చి రైతులకు మేలు చేశారు. మారుమూల తండాలను, గ్రామాలను పంచాయతీలుగా చేసి అభివృద్ధి చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్. 60 ఏండ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కేసీఆర్ కేవలం పదేండ్లలో చేసి చూపించారు.

– నాంపల్లి జగన్, కల్వలపాలెం, మాడ్గులపల్లి మండలం

## ఎన్నికల్లో గెలుపోటములు సహజం

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చండూరు, డిసెంబర్ 24 : ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతిరెడ్డితో కలిసి చండూరులో ఆదివారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని, హామీలు నెరవేర్చకపోతే నిలదీద్దామని, అందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే రూ.572 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 2018లో గెలిచిన రాజగోపాల్‌రెడ్డి అధికారం లేకపోవడం వల్ల పనులు చేయలేకపోయానని సాకులు చెప్పారని, ఇప్పుడు నియోజకవర్గాన్ని ఏ మేరకు అభివృద్ధి చేస్తాడో చూద్దామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఈ ప్రాంత ప్రాజెక్టులను పూర్తి చేయించాలని సూచించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు సంయమనంతో పని చేయాలని, స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ, జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, బీఆర్‌ఎస్ చండూరు, గట్టుప్పల్ మండలాల అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న, ఇడెం కైలాసం, పట్టణ అధ్యక్షుడు భూతరాజు దశరథ, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు

## గిరిజన బిడ్డ దాస్యనాయక్‌కు ఐఆర్‌ఎస్‌గా పదోన్నతి

- ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియామకం



నేనావత్ దాస్యనాయక్

దేవరకొండ, డిసెంబర్ 24 : కొండమల్లేపల్లి మండలం గాజీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చింతచెట్టుతండాకు చెందిన నేనావత్ దాస్యనాయక్‌కు ఐఆర్‌ఎస్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చింతచెట్టు తండాకు చెందిన నేనావత్ రాములునాయక్, దేవీబాయి దంపతుల మూడో కుమారుడు దాస్యనాయక్ విద్యాభ్యాసమంతా ప్రభుత్వ విద్యాలయాల్లోనే కొనసాగింది. ఏడో తరగతి వరకు ముడుదండ్ల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో, 10వ తరగతి దేవరకొండ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ దేవరకొండ బాలుర జూనియర్ కళాశాలలో చదివారు. హైదరాబాద్‌లోని న్యూ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ (బయోకెమిస్ట్రీ) చదువుతుండగానే 1993లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు ఎంపికై కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు ఐఆర్‌ఎస్‌గా పదోన్నతి పొందారు. ఇన్‌కం ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఈ నెల 22న ఉత్తర్వులు అందుకున్నారు. ఇతర రాష్ట్రాల్లో త్వరలోనే పోస్టింగ్ ఇవ్వనున్నట్లు దాస్యనాయక్ తెలిపారు. ఐఆర్‌ఎస్‌గా పదోన్నతి పొందిన గిరిజన బిడ్డ దాస్యనాయక్‌కు గ్రామస్తులు, చిన్ననాటి మిత్రులు అభినందనలు తెలిపారు.

## సామాజిక చరిత్రను భవిష్యత్ తరాలకు అందజేసేవే కథలు

**సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ**



దురస్తు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, కవులు, రచయితలు

రామగిరి, డిసెంబర్ 24 : సామాజిక చరిత్రను భవిష్యత్ తరాలకు అందజేసేవే కథలు అని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. నల్లగొండ కథ పాఠశాల ఆధ్వర్యంలో ప్రచురించిన తెలంగాణ కథా సంకలనం 'దురస్తు' పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కవులు, రచయితలతో కలిసి పుస్తకావిష్కరణ చేసి మాట్లాడారు. తెలంగాణ కథా రచయితలు ఆత్మగౌరవంతో తమ కథలను ప్రకటిస్తుండడం హర్షణీయమన్నారు. ప్రముఖ కవి మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ తెలుగు కథకు పుట్టినిల్లు నల్లగొండ అని, ఈ నేలపై తెలుగు కథ గొప్పగా వికసించిందని పేర్కొన్నారు. తెలంగాణ నేల నుంచి ఎన్నో గొప్ప కథలు వచ్చాయని డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. డాక్టర్ పగడాల నాగేందర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తెలంగాణ కథను తమ సంపాదకత్వంలో వెలుగులోకి తెస్తున్న సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్‌ను అభినందించారు. నల్లగొండ కథ పాఠశాల ఇంతటి గొప్ప ఆవిష్కరణలు చేయడం అభినందనీయమన్నారు. కవి, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నల్లగొండ కథ పాఠశాల నిర్వాహకులు పెరుమళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, డాక్టర్ బెల్లి యాదయ్య, భూతం ముత్యాలు, ఉప్పల పద్మ, మునాస్ వెంకట్, అంబటి వెంకన్న, తండు కృష్ణకౌండిన్య, విశ్రాంత ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్ పాల్గొన్నారు.


## మెర్రీ క్రిస్మస్

**నేడు ఏసుక్రీస్తు జనన వేడుకలు**

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన చర్చిలు
- క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి




సూర్యాపేట నెహ్రూనగర్‌లో విద్యుద్దీపాల అలంకరణలో సీఎస్ఐ చర్చి



నల్లగొండ మరియరాణి చర్చిలో క్రీస్తు జనన ఘట్టం

రామగిరి, డిసెంబర్ 24 : ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలకు అంతా సిద్ధమైంది. చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతోపాటు కేక్ కటింగ్ చేయనున్నారు. మరో వైపు క్రిస్టియన్లు తమ ఇండ్లపై స్టార్ లైట్లను ఏర్పాటు చేసుకోగా శాంటాక్లాజ్ వేషధారణలతో చిన్నారులు సందడి చేస్తున్నారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వమానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని, ఆయన జన్మదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు.